28-11-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - జ్ఞానము వెన్న, భక్తి మజ్జిగ, తండ్రి మీకు జ్ఞానము రూపీ వెన్నను ఇచ్చి విశ్వాధిపతులుగా తయారుచేస్తారు, అందుకే శ్రీకృష్ణుని నోటిలో వెన్నను చూపిస్తారు"

ప్రశ్న:- నిశ్చయబుద్ధి కలవారి గుర్తులు ఏమిటి? నిశ్చయము యొక్క ఆధారంపై ఏ ప్రాప్తి కలుగుతుంది?

జవాబు:- 1. నిశ్చయబుద్ధి పిల్లలు దీపముపై బలిహారమయ్యే సత్యమైన దీపపు పురుగుల వలె ఉంటారు, అంతేకాని చుట్టూ తిరిగేవారిగా కాదు. ఎవరైతే దీపముపై బలిహారమవుతారో వారే రాజ్యములోకి వస్తారు, చుట్టూ తిరిగేవారు ప్రజలలోకి వెళ్ళిపోతారు. 2. ధరిత్రిని వదలాల్సి వచ్చినా ధర్మాన్ని వదలకండి - ఈ ప్రతిజ్ఞ నిశ్చయబుద్ధి కల పిల్లలది. వారు సత్యమైన ప్రీతిబుద్ధి కలవారిగా అయి దేహ సహితంగా దేహపు సర్వ ధర్మాలనూ మరచి తండ్రి స్మృతిలో ఉంటారు.

పాట:- ఆకాశ సింహాసనాన్ని వదిలి రండి... (ఛోడ్ భీ దే ఆకాశ్ సింహాసన్...)

ఓం శాంతి. భగవానువాచ. భగవంతుడు అని నిరాకార పరమపితను అంటారు. భగవానువాచ అని ఎవరన్నారు? ఆ నిరాకారుడైన పరమపిత పరమాత్మ అన్నారు. నిరాకార తండ్రి నిరాకార ఆత్మలకు కూర్చొని అర్థం చేయిస్తారు. నిరాకార ఆత్మ ఈ శరీరం రూపీ కర్మేంద్రియాల ద్వారా వింటుంది. ఆత్మను పురుష్ అని కానీ, స్త్రీ అని కానీ అనరు, ఆత్మ అనే అంటారు. ఆత్మ స్వయంగా ఈ ఇంద్రియాల ద్వారా అంటుంది - నేను ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటాను. మనుష్యమాత్రులెవరైతే ఉన్నారో వారంతా సోదరులు. నిరాకార పరమపిత పరమాత్మునికి సంతానముగా ఉన్నారు కావున పరస్పరం అందరూ సోదరులు అవుతారు, ప్రజాపిత బ్రహ్మకు సంతానముగా ఉన్నారు కావున సోదరీ-సోదరులు అవుతారు. ఈ విషయాన్ని సదా అందరికీ అర్థం చేయిస్తూ ఉండండి. భగవంతుడు రక్షకుడు, భక్తులకు భక్తి ఫలాన్ని ఇచ్చేవారు.

తండ్రి అర్థం చేయిస్తారు - సర్వుల సద్గతిదాత నేనొక్కడినే. సర్వులకు శిక్షకునిగా అయి శ్రీమతాన్ని ఇస్తాను, అలాగే సర్వులకు సద్గురువును కూడా. వారికి తండ్రి, టీచర్, గురువు ఎవ్వరూ లేరు. ఆ తండ్రే ప్రాచీన భారత్ యొక్క రాజయోగాన్ని నేర్పిస్తారు, శ్రీకృష్ణుడు కాదు. శ్రీకృష్ణుడిని తండ్రి అని అనలేరు. అతడిని దైవీ గుణధారి అయిన స్వర్గం యొక్క రాకుమారుడు అని అంటారు. పతిత-పావనుడు, సద్గతిదాత అని ఒక్కరినే అంటారు. ఇప్పుడు అందరూ దుఃఖితులుగా, పాపాత్ములుగా, భ్రష్టాచారులుగా ఉన్నారు. భారత్ యే సత్యయుగంలో దైవీ శ్రేష్ఠాచారిగా ఉండేది. అదే మళ్ళీ భ్రష్టాచారీ అసురీ రాజ్యంగా అవుతుంది. పతిత-పావనా రండి, వచ్చి రామ రాజ్యాన్ని స్థాపన చేయండి అని అందరూ పిలుస్తారు. అంటే ఇప్పుడు ఉన్నది రావణ రాజ్యము. రావణుడిని కాలుస్తారు కూడా, కానీ రావణుడి గురించి ఏ విద్వాంసులు, ఆచార్యులు, పండితులు మొదలైనవారికి తెలియదు. సత్యయుగం నుండి త్రేతా వరకు రామ రాజ్యము, ద్వాపరం నుండి కలియుగం వరకు రావణ రాజ్యము ఉంటుంది. బ్రహ్మ యొక్క పగలు అంటే బ్రహ్మకుమార-కుమారీల యొక్క పగలు. బ్రహ్మ యొక్క రాత్రి అంటే బి.కే.ల యొక్క రాత్రి. ఇప్పుడు రాత్రి పూర్తి అయి పగలు రానున్నది. వినాశకాలే విపరీత బుద్ధి అని అంటూ ఉంటారు. మూడు సైన్యాలు కూడా ఉన్నాయి. పరమపితను అతి ప్రియమైన గాడ్ ఫాదర్, జ్ఞానసాగరుడు అని అంటారు. అంటే వారు తప్పకుండా జ్ఞానాన్ని ఇస్తూ ఉండవచ్చు కదా. వారు సృష్టికి చైతన్య బీజరూపుడు. వారు సుప్రీమ్ సోల్ అనగా ఉన్నతోన్నతమైన భగవంతుడు. అలాగని వారు సర్వవ్యాపి కాదు. సర్వవ్యాపి అని అనడము అంటే తండ్రిని నిందించినట్లు. తండ్రి అంటారు - నింద చేస్తూ-చేస్తూ ధర్మ గ్లాని జరిగిపోయింది, భారత్ నిరుపేదగా, భ్రష్టాచారిగా అయిపోయింది. ఇటువంటి సమయంలోనే నేను రావాల్సి ఉంటుంది. భారత్ యే నా జన్మస్థానము. సోమనాథ మందిరము, శివుని మందిరము కూడా ఇక్కడే ఉన్నాయి. నేను నా జన్మస్థానాన్నే స్వర్గముగా తయారుచేస్తాను, ఆ తర్వాత రావణుడు నరకముగా తయారుచేస్తాడు అనగా రావణుని మతంపై నడుస్తూ నరకవాసులుగా, అసురీ సాంప్రదాయులుగా అవుతారు. మళ్ళీ వారిని మార్చి నేను దైవీ సాంప్రదాయులుగా, శ్రేష్ఠాచారులుగా తయారుచేస్తాను. ఇది విషయసాగరము. అది క్షీరసాగరము. అక్కడ నేతి నదులు ప్రవహిస్తాయి. సత్య-త్రేతాయుగాలలో భారత్ సదా సుఖవంతంగా, సంపన్నంగా ఉండేది, వజ్ర-వైఢూర్యాల మహళ్ళు ఉండేవి. ఇప్పుడైతే భారత్ 100 శాతము నిరుపేదగా ఉంది. నేనే వచ్చి 100 శాతం సంపన్నంగా, శ్రేష్ఠాచారిగా

తయారుచేస్తాను. ఇప్పుడు ఎంత భ్రష్టాచారులుగా అయిపోయారంటే, తమ దైవీ ధర్మాన్నే మర్చిపోయారు.

తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు - భక్తి మార్గము మజ్జిగ, జ్ఞాన మార్గము వెన్న. శ్రీకృష్ణుని నోటిలో వెన్నను చూపిస్తారు అనగా విశ్వ రాజ్యము ఉండేది, లక్ష్మీ-నారాయణులు విశ్వాధిపతులుగా ఉండేవారు. తండ్రే వచ్చి అనంతమైన వారసత్వాన్ని ఇస్తారు అనగా విశ్వాధిపతులుగా తయారుచేస్తారు. వారంటారు - నేను విశ్వానికి యజమానిగా అవ్వను. ఒకవేళ యజమానిగా అయినట్లయితే మళ్ళీ మాయతో ఓడిపోవలసి కూడా ఉంటుంది. మాయతో మీరు ఓడిపోతారు, మళ్ళీ విజయం కూడా మీరే పొందాలి. ఈ 5 వికారాలలో చిక్కుకుని ఉన్నారు. ఇప్పుడు నేను మిమ్మల్ని మందిరంలో ఉండేందుకు యోగ్యులుగా తయారుచేస్తాను. సత్యయుగము పెద్ద మందిరము, దానిని శివాలయము అని అంటారు, అది శివుని ద్వారా స్థాపించబడినది. కలియుగాన్ని వేశ్యాలయము అని అంటారు, ఇక్కడ అందరూ వికారులుగా ఉన్నారు. ఇప్పుడు తండ్రి అంటారు - దేహపు ధర్మాలను వదిలి స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రినైన నన్ను స్మృతి చేయండి. పిల్లలైన మీకు ఇప్పుడు తండ్రితో ప్రీతి ఉంది. మీరు ఇంకెవ్వరినీ స్మృతి చేయరు. మీరు వినాశకాలే ప్రీతిబుద్ధి కలవారు. శ్రీ శ్రీ 108 అని పరమపిత పరమాత్మనే అంటారని మీకు తెలుసు. 108 మాలను తిప్పుతారు. పైన శివబాబా ఉన్నారు, ఆ తర్వాత మాతాపితలైన బ్రహ్మ-సరస్వతి, ఆ తర్వాత భారత్ ను పావనంగా తయారుచేసే పిల్లలు ఉన్నారు. రుద్రాక్ష మాల మహిమ చేయబడింది, దానిని రుద్ర యజ్ఞము అని కూడా అంటారు. ఇది ఎంత పెద్ద రాజస్వ అశ్వమేధ అవినాశీ జ్ఞాన యజ్ఞము. ఇది ఎన్ని సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తుంది. అనేక ధర్మాలు ఏవైతే ఉన్నాయో, అవన్నీ ఈ యజ్ఞంలో అంతమవ్వనున్నాయి, అప్పుడు ఈ యజ్ఞము పూర్తవుతుంది. ఇది అవినాశీ బాబా యొక్క అవినాశీ యజ్ఞము. సామాగ్రి అంతా ఇందులో స్వాహా అవ్వనున్నది. వినాశనం ఎప్పుడు అవుతుంది అని అడుగుతారు. అరే, ఎవరైతే స్థాపన చేస్తారో, వారే మళ్ళీ పాలన చేయవలసి ఉంటుంది. వీరు శివబాబా రథము. శివబాబా వీరిలో సారథిగా ఉన్నారు. అంతేకానీ గుర్రపు బండి మొదలైనవేవీ లేవు. వారు కూర్చొని భక్తి మార్గపు సామాగ్రిని తయారుచేసారు. బాబా అంటారు, నేను ఈ ప్రకృతి యొక్క ఆధారాన్ని తీసుకుంటాను.

తండ్రి అర్థం చేయిస్తారు - మొదట అవ్యభిచారి భక్తి ఉండేది, తర్వాత కలియుగ అంతిమంలో పూర్తిగా వ్యభిచారిగా అయిపోతుంది. మళ్ళీ తండ్రి వచ్చి భారత్ కు వెన్నను ఇస్తారు. మీరు విశ్వానికి యజమానులుగా అయ్యేందుకు చదువుతున్నారు. తండ్రి వచ్చి వెన్నను తినిపిస్తారు. రావణ రాజ్యంలో మజ్జిగ ప్రారంభమవుతుంది. ఇవన్నీ అర్థం చేసుకోవాల్సిన విషయాలు. కొత్త పిల్లలు ఈ విషయాలను అర్థం చేసుకోలేరు. పరమపిత పరమాత్మనే జ్ఞానసాగరుడు అని అంటారు. తండ్రి అంటారు - నేను ఈ భక్తి మార్గములో ఎవరికీ లభించను. నేను ఎప్పుడైతే వస్తానో, అప్పుడే వచ్చి భక్తులకు భక్తి ఫలాన్ని ఇస్తాను. నేను ముక్తిదాతగా అవుతాను, దుఃఖము నుండి విడిపించి అందరినీ శాంతిధామానికి, సుఖధామానికి తీసుకువెళ్తాను. నిశ్చయబుద్ధి విజయంతి, సంశయబుద్ధి వినశ్యంతి.

తండ్రి దీపము. కొందరు దీపపు పురుగులు వారిపై పూర్తిగా బలిహారమైపోతారు, కొందరు చుట్టూ తిరిగి వెళ్ళిపోతారు. అసలేమీ అర్థం చేసుకోరు. బలిహారమయ్యే పిల్లలకు తెలుసు - తప్పకుండా అనంతమైన తండ్రి నుండి మాకు అనంతమైన వారసత్వం లభిస్తుంది అని. ఎవరైతే కేవలం చుట్టూ తిరిగి వెళ్ళిపోతారో, వారు ఇక ప్రజల్లోనే నంబరువారుగా వస్తారు. ఎవరైతే బలిహారమవుతారో, వారు నంబరువారు పురుషార్థం అనుసారంగా వారసత్వాన్ని తీసుకుంటారు. పురుషార్థంతోనే ప్రారబ్ధం లభిస్తుంది. జ్ఞానసాగరుడు ఒక్క తండ్రే. తర్వాత జ్ఞానం కనుమరుగైపోతుంది. మీరు సద్గతిని పొందుతారు. సత్య-త్రేతాయుగాలలో గురువులు-పండితులు మొదలైనవారెవ్వరూ ఉండరు. ఇప్పుడు అందరూ ఆ తండ్రిని స్మృతి చేస్తారు ఎందుకంటే వారు జ్ఞానసాగరుడు. అందరికీ సద్గతిని ఇస్తారు. అప్పుడు హాహాకారాలు సమాప్తమై జయజయకారాలు జరుగుతాయి. మీకు సృష్టి ఆదిమధ్యాంతాల గురించి తెలుసు. మీరు ఇప్పుడు త్రికాలదర్శులుగా, త్రినేత్రులుగా అయ్యారు. మీకు రచయిత మరియు రచన యొక్క ఆదిమధ్యాంతాల జ్ఞానమంతా లభిస్తుంది. ఇవేమీ కట్టుకథలు కావు. గీత అనేది భగవంతుని ద్వారా గానం చేయబడింది, కానీ శ్రీకృష్ణుని పేరును వేసి ఖండితం చేసేసారు. పిల్లలైన మీరు ఇప్పుడు అందరి కళ్యాణం చేయాలి. మీరు శివశక్తి సైన్యము. వందేమాతరం అని అంటూ ఉంటారు. పవిత్రమైనవారికే వందనం చేయడం జరుగుతుంది. కన్య పవిత్రంగా ఉన్నప్పుడు ఆమెకు అందరూ నమస్కరిస్తారు. అత్తవారింటికి వెళ్ళి వికారీగా అయితే, ఆమె అందరికీ తల వంచి నమస్కరిస్తూ ఉంటారు. మొత్తం ఆధారమంతా పవిత్రతపై ఉంది. భారత్ పవిత్ర గృహస్థ ధర్మంగా ఉండేది. ఇప్పుడు అపవిత్ర గృహస్థ ధర్మంగా ఉంది. దుఃఖమే దుఃఖము ఉంది. సత్యయుగంలో అలా ఉండదు. తండ్రి పిల్లల కొరకు అరచేతిలో స్వర్గాన్ని తీసుకొస్తారు. గృహస్థ వ్యవహారంలో ఉంటూ తండ్రి నుండి జీవన్ముక్తి వారసత్వాన్ని తీసుకోవచ్చు. ఇందులో

ఇళ్లు-వాకిళ్ళను వదిలే విషయమేమీ లేదు. సన్యాసుల నివృత్తి మార్గం వేరు. ఇప్పుడు తండ్రితో ప్రతిజ్ఞ చేస్తారు - బాబా, మేము పవిత్రంగా అయి, పవిత్ర ప్రపంచానికి యజమానులుగా తప్పకుండా అవుతాము. ఇక ధరిత్రిని వదలాల్సి వచ్చినా ధర్మాన్ని వదలకండి. 5 వికారాలను దానమిచ్చినట్లయితే మాయా గ్రహణం వదులుతుంది, అప్పుడు 16 కళల సంపూర్ణులుగా అవుతారు. సత్యయుగంలో 16 కళల సంపూర్ణులుగా, సంపూర్ణ నిర్వికారులుగా... ఉంటారు, ఇప్పుడు శ్రీమతంపై నడుస్తూ మళ్ళీ ఆ విధంగా తయారవ్వాలి.

భగవంతుడు పేదల పెన్నిధి. షావుకారులు ఈ జ్ఞానాన్ని చేపట్టలేరు ఎందుకంటే వారు - మాకు ధనము మొదలైనవి ఎన్నో ఉన్నాయి, మేమైతే స్వర్గంలో కూర్చుని ఉన్నాము అని భావిస్తారు. అందుకే అబలలు, అహల్యలే జ్ఞానాన్ని తీసుకుంటారు. భారత్ అయితే నిరుపేదగా ఉంది. అందులోనూ ఎవరైతే పేదవారు, సాధారణమైనవారు ఉంటారో, వారినే తండ్రి తమవారిగా చేసుకుంటారు. వారి భాగ్యములోనే ఉంది. సుదాముని ఉదాహరణ గాయనము చేయబడింది కదా. షావుకారులకు అర్థం చేసుకునేందుకు తీరిక లేదు. రాజేంద్ర ప్రసాద్ (భారత్ యొక్క ప్రథమ రాష్ట్రపతి) వద్దకు కుమార్తెలు వెళ్ళేవారు, వారు - అనంతమైన తండ్రిని తెలుసుకున్నట్లయితే మీరు వజ్రతుల్యంగా అవుతారు, 7 రోజుల కోర్సు చేయండి అని చెప్పేవారు. అతను అనేవారు - అవును, విషయమైతే చాలా బాగుంది, రిటైర్ అయిన తర్వాత కోర్సు చేపడతాను. రిటైర్ అయిన తర్వాత - నేను అనారోగ్యంగా ఉన్నాను అని అన్నారు. గొప్ప-గొప్ప వ్యక్తులకు తీరిక లేదు. మొదట ఎప్పుడైతే 7 రోజుల కోర్సును పూర్తి చేస్తారో, అప్పుడు నారాయణీ నషా ఎక్కుతుంది. ఊరికే ఏమైనా రంగు అంటుకుంటుందా. 7 రోజుల తర్వాత - వీరు యోగ్యులా కాదా అన్నది తెలుస్తుంది. యోగ్యులైతే చదువుకునేందుకు పురుషార్థంలో నిమగ్నమవుతారు. ఎప్పటివరకైతే భట్టీలో రంగు పూర్తిగా అంటుకోదో, అప్పటివరకు బయటకు వెళ్తే అంటుకున్న రంగు అంతా మాయమైపోతుంది, అందుకే మొదట పక్కాగా రంగు అంటించాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. శివశక్తిగా అయ్యి విశ్వ కళ్యాణం చేయాలి. పవిత్రత ఆధారంగా గవ్వతుల్యమైన మనుష్యులను వజ్రతుల్యంగా తయారుచేయాలి.

2. శ్రీమతం అనుసారంగా వికారాలను దానమిచ్చి సంపూర్ణ నిర్వికారులుగా, 16 కళల సంపూర్ణులుగా అవ్వాలి. దీపంపై బలిహారమయ్యే దీపపు పురుగులుగా అవ్వాలి.

వరదానము:- పరిస్థితులను సైట్ సీన్లుగా భావిస్తూ వాటిని దాటి వేసే స్మృతి స్వరూప సమర్థ ఆత్మ భవ

స్మృతి స్వరూప ఆత్మ సమర్థంగా ఉన్న కారణంగా పరిస్థితులను ఆటగా భావిస్తుంది. ఎంత పెద్ద పరిస్థితి అయినా కానీ, సమర్థ ఆత్మకు అవన్నీ గమ్యానికి చేరుకునేందుకు మార్గంలోని సైట్-సీన్లు. మనుష్యులైతే ఖర్చు పెట్టి కూడా సైట్-సీన్లు చూసేందుకు వెళ్తారు. కావున స్మృతి స్వరూప సమర్థ ఆత్మల కొరకు పరిస్థితులు అనండి, పరీక్షలు అనండి, విఘ్నాలు అనండి అన్నీ సైట్-సీన్లే, మరియు ఈ గమ్యము యొక్క సైట్-సీన్లను లెక్కలేనన్ని సార్లు దాటి వేసాము, ఇది కొత్తేమీ కాదు అన్నది వారికి గుర్తు ఉంటుంది.

స్లోగన్:- ఇతరులను కరెక్షన్ చేసేందుకు బదులుగా తండ్రితో కనెక్షన్ ను జోడించినట్లయితే వరదానాల అనుభూతి కలుగుతూ ఉంటుంది.

మతేశ్వరిగారి మధుర మహావాక్యాలు

"కేవలం ఓం అన్న పదాన్ని ఉచ్చరించినంత మాత్రాన ఏ లాభము ఉండదు"

ఓం ను కంఠస్థం చేయండి అనగా ఓం ను జపించండి అని అంటారు, ఓం అని మనం అన్నప్పుడు, ఓం అన్న మాటకు అర్థము ఓం ఉచ్చరించాలి అని కాదు. కేవలము ఓం అని అనటం వలన జీవితంలో ఎటువంటి లాభము ఉండదు. కానీ

ఓం అన్న మాట యొక్క అర్ధ స్వరూపంలో స్థితులవ్వటము ద్వారా, ఆ ఓం యొక్క అర్థాన్ని తెలుసుకోవటం ద్వారా మనుష్యులకు ఆ శాంతి ప్రాప్తిస్తుంది. మాకు శాంతి లభించాలి అని ఇప్పుడు మనుష్యులైతే తప్పకుండా కోరుకుంటారు. ఆ శాంతి స్థాపన కొరకు ఎన్నో సమ్మేళనాలు చేస్తున్నారు కానీ వాటి రిజల్టు ఎలా కనిపిస్తుందంటే - అవి ఇంకా ఎక్కువ అశాంతి మరియు దుఃఖానికి కారణాలుగా అవుతున్నాయి. దీనికి ముఖ్యమైన కారణమేమిటంటే - మనుష్యాత్మలు ఎప్పటివరకైతే 5 వికారాలను తొలగించుకోరో, అప్పటివరకు ప్రపంచంలో శాంతి ఎట్టి పరిస్థితిలో ఏర్పడలేదు. కనుక ముందుగా మనుష్యులు ప్రతి ఒక్కరూ తమ 5 వికారాలను వశం చేసుకోవాలి మరియు తమ ఆత్మ యొక్క దారాన్ని పరమాత్మతో జోడించాలి, అప్పుడే శాంతి స్థాపనవుతుంది. కావున మనుష్యులు తమను తాము ప్రశ్నించుకోవాలి - నేను నా 5 వికారాలను తొలగించుకున్నానా? వాటిని గెలిచేందుకు ప్రయత్నించానా? మేము మా 5 వికారాలను ఎలా వశం చేసుకోవాలి అని ఒకవేళ ఎవరైనా అడిగితే, వారికి ఈ విధానాన్ని తెలియజేయాలి - మొదటగా వారికి జ్ఞాన-యోగాల ధూపాన్ని వేయండి మరియు దానితోపాటు పరమపిత పరమాత్ముని మహావాక్యము ఏముందంటే - నాతో బుద్ధియోగాన్ని జోడించి, నా శక్తిని తీసుకుని సర్వశక్తివాన్ ప్రభువునైన నన్ను గుర్తు చెయ్యటం ద్వారా వికారాలు తొలగుతూ ఉంటాయి. ఇప్పుడు ఇంత సాధన కావాలి, దీనిని స్వయంగా పరమాత్మయే వచ్చి మనకు నేర్పిస్తారు. అచ్ఛా. ఓం శాంతి.